చి'వరి' పంటలు చేతికొచ్చేనా!

- ఆలస్యంగా సాగుచేసిన పొలాలకు ఇంకా నీళ్లు అవసరం
- మరో వారం రోజులు నీటిని వదలాలని రైతుల వినతి



వేల్పుచర్ల - రామన్నగూడెం గ్రామాల మధ్య ఎండిన వరి పొలం

అర్వపల్లి : యాసంగి సీజన్‌కు సంబంధించి ఆలస్యంగా సాగు చేసిన వరి పంటలకు ఇంకా కొన్ని రోజులు నీటి అవసరం ఉంది. ముందుగా నాట్లు వేసిన పొలాలు కోతకు వచ్చాయి. ఆలస్యంగా వరి సాగుచేసిన రైతులకు మరికొద్ది రోజులు నీటి అవసరం ఏర్పడింది. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్ నందు రైతులు సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. అయితే గోదావరి జలాలపై ఆధారపడి ఇందులో 75 శాతం మంది రైతులు వరిపంటలు సాగు చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆరు విడతలుగా గోదావరి జలాలను విడుదల చేసినప్పటికీ ఈసారి నీటిని తగ్గించారు. వారబందీ విధానంలో వారం రోజుల పాటు నీటిని వదలాల్సి ఉండగా నాలుగైదు రోజులకు తగ్గించారు. దీంతో చివరి భూములకు అసలే నీళ్లు అందకపోవడంతో ఆ భూముల్లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా ఆలస్యంగా సాగుచేసిన రైతులకు పంటచేతికొచ్చే పరిస్థితి లేకుండా ఏర్పడింది.

నీటిని వదలాలని వినతి..

శ్రీరాంసాగర్ రెండో దశ (ఎస్సారెస్పీ)కు గోదావరి జలాలను మరో వారం రోజుల పాటు వదిలితే ఎండిపోతున్న వరి పొలాలు చేతికొస్తాయని రైతులు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఎండిపోతున్న పంటలను కాపాడాలంటే గోదావరి జలాలే ఆధారం. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి వరి పంట సాగుచేశామని.. మరో విడత నీటిని వదలాలని ఆలస్యంగా వరి సాగు చేసిన రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండెకరాల పంట ఎండిపోయింది

"మూడెకరాలు వరి పంట సాగు చేయగా ఒక ఎకరానికి మాత్రమే గోదావరి జలాలు అందాయి. మిగిలిన రెండు ఎకరాలకు నీళ్లు అందక వరి పంట ఎండిపోతుంది. పెట్టుబడులకు అప్పులు తెచ్చి పెట్టాను. ప్రభుత్వం ఎండిన వరి పొలానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– రమావత్ రమేష్, రైతు, రామన్నగూడెంతండా

గోదావరి జలాలపై ఆధారపడి..

"గోదావరి జలాలపై ఆధారపడి 15 ఎకరాల వరిపొలం సాగుచేశాను. కొంత పంటకు నీళ్లందాయి. ఐదెకరాలకు నీళ్లు చాలడం లేదు. మరో వారంరోజుల పాటు గోదావరి జలాలను వదిలి వరి పంటలను కాపాడాలి.

– ఎండి. హమీద్, రైతు, చాకలిగూడెం

రైతులు నాణ్యమైన ధాన్యం తేవాలి



ఇమాంపేటలోని కొనుగోలు కేంద్రంలో తేమశాతం పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు



పెన్‌పహాడ్‌లోని రైస్‌మిల్లులో యజమానితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కలెక్టర్ వెంకటరావు సూచించారు. సోమవారం సూర్యాపేట మండలం ఇమాంపేటలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి ధాన్యం తేమ శాతం మిషన్ ద్వారా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూకొనుగోలు కేంద్రాలకు 354.896 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని ఇప్పటి వరకు 241.000మెట్రిక్ టన్నులు వచ్చిందని తెలిపారు. రైతులు తాలు లేకుండా, తేమ శాతం 17మించకుండా నాణ్యమైన ధాన్యం తేవాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆ దిశగా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 281 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుద్ధి యంత్రాలు, తేమశాతం మిషన్లు, టార్పాలిన్లు, గోనె సంచులు అందుబాటులో ఉంచాలని, టెంట్లు, నీటి వసతి కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడ కూడా దళారుల చేతిలో రైతులు మోసపోకుండా వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్‌బాబు, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, డీటీ నాగలక్ష్మి, ఏపీఎం బాబు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు బియ్యం సరఫరా చేయాలి

పెన్‌పహాడ్ : ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటసాయి రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎంఆర్ ధాన్యం, బాయిల్డ్ రైస్ ఎఫ్‌సీఐకి కేటాయించిన ప్రకారం వెంటనే అందించాలని ఆదేశించారు. రైస్ మిల్లులోని బియ్యం నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ లాలు నాయక్, నాగలక్ష్మి, భుజంగరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్లు గ్రామానికి చెందిన గుండాల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో నెమ్మికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం మృతుడి కుటుంబానికి రూ. 43వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుండు లక్ష్మణ్, కోటేష్, జగన్, సైదులు, కిరణ్, స్వరూప, రేష్మా, ఇందిర పాల్గొన్నారు.

లావణ్య కుటుంబానికి ఆర్థికసాయం

ఆత్మకూర్(ఎస్) : ఇటీవల సూర్యాపేటలో జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన కలకోట్ల లావణ్య కుటుంబానికి చందన కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం సోమవారం రూ.50వేల ఆర్థికసాయం అందించారు. ఏనుబాముల గ్రామానికి చెందిన కలకోట లావణ్య తల్లిదండ్రులు కలకోట్ల చంద్రయ్య, నిర్మలకు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో చందనా బీఈడీ కళాశాల ప్రధానాచార్యులు జి.శ్రవణ్ కుమార్, విద్యాసంస్థల సలహా అధికారి గుండా రమేష్, అధ్యాపకులు డి.రవి కుమార్, ఎం.వీరయ్య, సకినాల రమేష్ పాల్గొన్నారు.

బోనస్ చెల్లించాలి

తుంగతుర్తి : రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ వెంకన్న

ఆత్మకూర్(ఎస్) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా తగు సౌకర్యాలు కల్పించి, వెంటనే కాంటాలు ప్రారంభించాలని మండల వైస్ ఎంపీపీ నేరెళ్ల వెంకన్న అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ నేరెళ్ల వెంకన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వేసవి దృష్ట్యా మండలంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ హాషీం, తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎంపీఓ సంజీవయ్య, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉగాది వేడుకలు



జాజిరెడ్డిగూడెం పాఠశాలలో ఉగాది పచ్చడి తయారు చేస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీక్రోధి నామ తెలుగు సంవత్సర ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఉగాది పచ్చడిని తయారుచేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు సేవించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాటిక సుధాకర్, ఉపాధ్యాయులు యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులు, సుగుణ, ఇందిర, వెంకటేశ్వర్లు, మంజుల, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఉండాలి



మాట్లాడుతున్న దుర్గ ప్రభాకర్

ఆత్మకూర్(ఎస్) : మనదేశం సెక్యులర్ దేశమని, మనమంతా కులమతాలకు అతీతంగా ఉండాలని పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ అన్నారు. సోమవారం నెమ్మికల్లులో ఏర్పాటు చేసిన మండల పాస్టర్ల ఫెలోషిప్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శాంతయ్య, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు గాబ్రియేల్, జలగం జేమ్స్, మార్క్, యడవెల్లి అబ్రహం, పుల్లూరు బోయాజ్, దావీద్, సైదానాయక్, సైమన్, మోజెస్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై సమీక్ష



మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారులు

అర్వపల్లి : అర్వపల్లితోపాటు గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం, సీతారాంపురం, పర్సాయపల్లిస్టేజీ తదితర ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను మిషన్ భగీరథ తుంగతుర్తి డివిజన్ డీఈ గుండూరావు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ యాదయ్య సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, ట్యాంకుల క్లోరినేషన్, లీకేజీల మరమ్మతుకు సంబంధించిన వివరాలను గ్రామ పంచాయతీ రికార్డులలో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈలు మహేష్, అశోక్, కార్యదర్శి శ్రావణి పాల్గొన్నారు.

బియ్యం సేకరణలో అలసత్వం వహించొద్దు



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్



నెమ్మికల్లులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నూతనకల్ : సీఎంఆర్ బియ్యం సరఫరా విషయంలో అలసత్వం వహించకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ఆర్డీఓ వేణుమాధవ్ ఆదేశించారు. సోమవారం బిక్కుమళ్లలోని మమత బిన్ని రైస్ మిల్లును పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు కేటాయించిన ధాన్యం పర్సంటేజీ ప్రకారం ప్రభుత్వానికి బియ్యాన్ని అందించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రసాద్, రామసాయం అనూప్‌రెడ్డి, ఏఓ మురళీబాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆత్మకూర్(ఎస్) : పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నెమ్మికల్లులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాలని, కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. ఈయన వెంట మండల తహసీల్దార్ వినోద్‌కుమార్, ఆర్ఐ అంజయ్య తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ శాఖ దాడుల్లో నల్లబెల్లం పట్టివేత



తుంగతుర్తిలో పట్టుబడిన నల్లబెల్లాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

తుంగతుర్తి : ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం దాడుల్లో మద్దిరాల మండలంలో సోమవారం 3,150 కిలోల నల్లబెల్లం పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ తనిఖీల్లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన బొలెరో వాహనంతోపాటు ఆటోలో తరలిస్తున్న 63 బస్తాల నల్ల బెల్లం (3150 కిలోల నల్ల బెల్లం), 10లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసున్నట్లు తెలిపారు. నల్ల బెల్లం తరలిస్తున్న షేక్ సైదా వాహనాన్ని వదిలిపెట్టి పారిపోయాడని తెలిపారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి ఆటో, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. నల్లబెల్లం విక్రయాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. నల్ల బెల్లంకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, గోపాల్ రావు, సిబ్బంది శ్రీను, ఆయుబ్, అఫ్సర్, శేఖర్‌రెడ్డి, బ్రహ్మం, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

మద్దిరాల : మామిండ్లమడవ గ్రామ శివారులో సోమవారం నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఖేష్, సిబ్బంది మల్లేష్, గోపాలరావు, తుంగతుర్తి ఎక్సైజ్ ఎస్ఐ మూర్తి ఆధ్వర్యంలో విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు నల్లబెల్లం పటిక, సారా పట్టుకున్నారు. మామిండ్లమడవ గ్రామానికి చెందిన షేక్ సైదా, శివ కుమార్ బోలెరో, ఆటోలలో 31క్వింటాల నల్ల బెల్లం, 50కేజీల పటిక, 10లీటర్ల సారా తరలిస్తుండగా వాహనాలను తనిఖీ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంప్రదాయాలను తెలియజేసేవే పండుగలు



తిరుమలగిరిలో ఉగాది పచ్చడి సేవిస్తున్న ఎమ్మెల్యే సామేల్



నూతనకల్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేవే పండుగలని, పండుగలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ ఇంట్లో సోమవారం ఉగాది పచ్చడిని సేవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలను గౌరవిస్తుందని తెలిపారు. పండుగల వల్ల బంధువులు, స్నేహితులలో ఆత్మీయత పెరుగుతుందని అన్నారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్ చైర్మన్ సరళా యాదవరెడ్డి, సుంకరి జనార్దన్, పేరాల వీరేష్, జిమ్మిలాల్, రాపాక సోమేష్ పాల్గొన్నారు.

సమాజ శాంతిస్థాపనే అల్లా ఉద్దేశం

నూతనకల్ : సమాజ శాంతిస్థాపనే అల్లా ఉద్దేశమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జహంగీర్, ఎండీ షకీల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, కళ్లెం కృష్ణారెడ్డి, చురుకంటి చంద్రారెడ్డి, పాల్వాయి నాగరాజు, జటంగి గణేష్, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలని రాష్ట్ర కార్యదర్శికి వినతి

అర్వపల్లి : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకులాలకు సొంతభవనాలు నిర్మించి పిల్లల ఇబ్బందులు తీర్చాలని కోరుతూ ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (పీపీఎల్) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కాసర్లపహాడ్‌కు చెందిన పీపీఎల్ వ్యవస్థాపకుడు మచ్చ నర్సయ్య మాట్లాడారు. తమ గ్రామంలో కూడా ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల కోసం 7ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని, ఇందులో సొంత భవనం నిర్మించాలని కోరారు. అలాగే స్థలాలు ఉన్న చోట్ల అవి ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, పిల్లలకు ల్యాప్‌ట్యాప్‌లు, నాణ్యమైన సూట్‌కేసులు పంపిణీ చేయాలని అన్నారు. ప్రతినెలా పేరెంట్స్ రాష్ట్ర కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పీపీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పీపీఎల్ ప్రతినిధులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



తిమ్మాపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఎం ఆంజనేయులు



నూతనకల్ : గుండ్లసింగారంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవ్



చివ్వెంల : తుల్జారావుపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

అర్వపల్లి : ఐరిస్‌తో పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని డీపీఎం ఆంజనేయులు చెప్పారు. సోమవారం మండల పరిధిలోని అర్వపల్లి, తిమ్మాపురం, కుంచమర్తి, రామన్నగూడెం, బొల్లంపల్లి గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాలలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఐరిస్ నిర్వహణకు సంబంధించి కేంద్రం నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఆర్. శశిధర్‌రెడ్డి, ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఏఈఓ సత్యం, సీసీలు పద్మావతి, నగేష్, వీఓఏలు పి.కృష్ణకుమారి, డి.విజయ, బి.చంద్రకళ, సుజాత, సరిత, పద్మ, సంఘబంధం నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను త్వరితగతిన నిర్వహించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆర్డీఓ వేణుమాధవ్ కోరారు. సోమవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు గుర్తించి వెంటనే కాంటాలు వేయించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రసాద్‌రావు, మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, ఏపీఎం కర్ణాకర్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర పొందాలి

చివ్వెంల : రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని మండల ప్రత్యేకాధికారి కె.జగదీశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తుల్జారావుపేట గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. సెంటర్ల నిర్వాహకులు రైతులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకే ధాన్యంను విక్రయించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



అర్వపల్లి : కుమ్మరిగూడెంలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏఎన్ఎం



తిరుమలగిరి : తొండ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి



మద్దిరాల : చందుపట్లలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

అర్వపల్లి : మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ ఆవాసం కుమ్మరిగూడెంలో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వైద్యసిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాసర్లపహాడ్ పల్లెదవాఖాన ఏఎన్ఎం తొప్పెట్ల నాగరాణి మాట్లాడారు. ఉపాధి కూలీలు ప్రతిరోజు ఉదయం 10 గంటల లోపే పనులు ముగించాలని సూచించారు. ఎండలలో ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బకు గురికావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త నాగమ్మ, ఉపాధి కూలీలు శనిగారపు సత్తయ్య, నిమ్మనగోటి యాదగిరి, కోటమర్తి నాగరాజు, వెంకన్న, పోరెండ్ల వెంకన్న, నిమ్మనగోటి వెంకన్న, పి.సత్తయ్య, పి. ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రజలు ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తరువాతే బయటకు వెళ్లి పనులు చేసుకోవాలని వైద్యాధికారి సతీష్ కోరారు. వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తలపై తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉందని, అధికంగా మంచి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని అన్నారు. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నెత్తిన టోపీ ధరించాలని, కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ స్వరూపారాణి, సమతారాణి, వెంకన్న, లలిత, విజయ్, భారతి, ఫీల్డ్ అసిస్టెంట్ గీత, ఆశ కార్యకర్తలు కళమ్మ, మంజుల, ఉమ పాల్గొన్నారు.

మద్దిరాల : చందుపట్ల గ్రామంలో ఉపాధిహామి కూలీలకు పంచాయతీ కార్యదర్శి తరుణ్ సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే టెంట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కార్మికులు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పరాల లింగయ్య, బోనగిరి నర్సయ్య, రంగు జగన్, ఫీల్డ్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

చేతిపంపు ఏర్పాటు.. తీరిన నీటి సమస్య

సాక్షి ఎఫెక్ట్..



నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని కేశవాపురం కట్టపై గుడి వద్ద ఉన్న చేతి పంపు తుప్పు పట్టి చెడిపోయింది. కొంతకాలంగా ఈ పంపు పనిచేయడం లేదు. దీంతో సాక్షిలో చేతిపంపు బాగుచేయించరూ.. అనే శీర్షికన కథనం ప్రచురించగా సంబంధిత అధికారులు స్పందించారు. సెంట్రల్ ఫండ్ నిధుల నుంచి రూ. 18 వేలు వెచ్చించి కొత్త పరికరాలు తెచ్చి బిగించారు. చేతిపంపు చుట్టూ గద్దెను కూడా నిర్మించారు. సోమవారం ఈ చేతిపంపు వినియోగంలోకి వచ్చిందని గ్రామ పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్ తెలిపారు. ఎంతో కాలంగా వృథాగా పడి ఉన్న చేతి పంపును వినియోగంలోకి తేవడానికి కృషి చేసిన సాక్షికి రైతులు, కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కవాతు



తుంగతుర్తిలో కవాతు చేస్తున్న పోలీసులు

తుంగతుర్తి : త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకై పోలీస్ కవాతు నిర్వహించినట్లు తుంగతుర్తి సర్కిల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు వెంపటి, కొత్తగూడెం గ్రామాల్లో 50 మంది సీఏపీఎఫ్ సిబ్బందితో సైనిక కవాతు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకారం అందించాలని అన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్, ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

సూర్యాపేటటౌన్ : పాలిటెక్నిక్, ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. తరగతులు ఈ నెల 24 నుంచి మే 20వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. గూగుల్ ఫామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 7036259922 నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అక్షర అని టైప్ చేసి పంపితే వాట్సాప్ గ్రూప్‌లో ఆటోమేటిక్‌గా యాడ్ అవుతారని తెలిపారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా క్లాసుల లింకులు పంపబడతాయని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 90003 05079 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.